# శ్రావణి



పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

శ్రావణి లేదు ఏంలేదు. నాన్నగారి హయాములో జరిగేది అంటే అది వేరు. ఇప్పుడు మాత్రం అలా జరగదు. జరగడానికి వీలులేదు" అని శేఖరం ఖరాకండీగా పురోహితుడితో చెప్పాడనే సంగతి తెలిసి, 'నిజంగావా?' అంటూ నివ్వెరపోయింది వైదేహి.

ఏవిటి ? శ్రావణి జరిపించడం మానేస్తానని శేఖర్ అన్నాడా ? నిజంగానే ! ఏటేటా వేదవిజ్ఞానవేత్తలైన ఉద్దండ పండితుల్నీ, ఘనాంతర స్వాధ్యాయవేత్తల్నీ రప్పించి ఘనంగా వారిని సన్మానిస్తూ దశదిశలా మారుమ్రోగేటట్లు నలభై ఏళ్లపాటు వాళ్ల నాన్నగారు అవిచ్ఛిన్నంగా జరిపిస్తూ వచ్చిన శ్రావణిని తను మానేస్తాడా ? ఇంక జరిపించడూ.

వైదేహికి హృదయం అంతా బాధా,ఆందోళనా ఆవేశాలతో చెయిపెట్టి కలచివేసినట్లయిపోయింది. ఎవరో పదిమంది తన చుట్టూ చేరి 'అయ్యో పెద్దయ్యగారి దర్జా ఆ జమీందారీ పద్ధతి అన్నీ పోయాయటగా, పెత్తనం పెద్దబ్బాయిగారి చేతికొచ్చాక—పాపం!' అంటూ తమ కుటుంబాన్ని అవహేళన చేస్తున్నట్లూహించుకొని బాధపడసాగింది. ఆయన పోయిన దుఃఖంతో అసలే సగం చచ్చి బతుకుతూన్న తనకి ఈ అవమానం ఒకటా? ఇందుకా దేవుడు తనని కూడా ఆయనతో తీసుకుపోకుండా ఇక్కడ అట్టే పెట్టింది. ఆయన పోయి ఇంకా నాలుగు నెలలైనా తిరక్కుండా ఈ ఇంటి పద్ధతులూ అలవాట్లూ ఎలా మారిపోతున్నాయి భగవంతుడా అంటూ మవునంగా తనలో తనే ఏడ్చింది. ఒక్క క్షణం మనస్సంతా వికలం అయిపోయి మెదడేం పనిచేయక శూన్యంగా చూస్తూ ఉండిపోయింది.

ఏవిటి వీడు రోజురోజుకీ ఇలా అయిపోతున్నాడు కుటుంబంలో ఎప్పుడూ లేని పద్ధతుల్ని ప్రవేశపెడుతున్నాడు ? మనకేం లేదా పోదా! ఊళ్లో అందరూ వాహా అనే లాంటి మూడు అంతస్తుల భవంతీ, గుమ్మం దిగితే చాలు అడుగు కింద పెట్టక్కర్లే

కుండా ఎల్లప్పుడూ అవారుగా ఉండే అందమైన గుర్రపుశార్బూ, ఇంటినిండా నౌకర్లూ చాకర్లూ ఇంటికి రోజూ వచ్చే పోయే అతిధులూ అభ్యాగతులూ—వీటి అన్నిటితో నిక్షేపంలా పదిమందిలోనూ దర్జాగా ఉండవలసింది అక్కే పోయి, ప్రతీ దాంట్లోనూ కూడికచేస్తూ బ్రత కడం—ఏం ఖర్మం వచ్చిందని ?

ఇలా అయితే ఆయన హయాములో కుటుంబానికి వచ్చిన హోదా, గౌరవం ఒకటి రెండేళ్లలో హారతి కర్పూరంలా హరించిపోవూ?—పూర్వాపరాల్నీ, తను చేసే పనులవల్ల వచ్చే మంచి చెడ్డల్నీ ఏమైనా ఆలోచిస్తున్నాడా ? లేకపోతే ఇన్నేళ్ల నుంచి ఇంట్లో జరిపిస్తూ వచ్చిన శ్రావణి మానెయ్యాలనే బుద్ధేమిటి ? ఎన్నివందలు ఖర్చుపెడితే మాత్రం అలాంటి మహా పండితుల ఆశీర్వచనాలు కుటుంబానికి లభించవద్దూ ?

ఏవిటో! క్రూరతనం—క్రూరతనమా అని! శేఖర్ ప్రవర్తన గురించి మనస్సులో ఎంత సరిపెట్టుకుందాం అన్నా సరిపెట్టుకోలేక పోతోంది వైదేహి. ఏవో ఆలోచనలు— మరేవో భయాలు—ఒకదాన్ని తరుము కుంటూ మరి ఒకటి ఆమె హృదయంలో సుళ్లు తిరుగుతున్నాయి.

ఆమె ఆలోచనలన్నీ శేఖర్ గురించే!

ఏమైనా చూస్తోంది కదూ, పెత్తనం చేతి కొచ్చినప్పటినుంచీ పెద్దాడి పద తేం బాగుండడంలేదు. రోజురోజుకీ వాడు చేసే పనులకి అర్ధంలేకుండా పోతోంది.

మొన్నటికి మొన్నా అంతే !

పాపం ముప్ఫై ఏళ్లనుంచీ ఈ ఇంటి నాశ్రయించుకొని బతుకుతూ యిక్కడే తన ముప్పు కూడా గడిచిపోతుందని నమ్మకంతో పడిఉన్న ఆ వీరయ్యాని - రేపు ఒకటో తారీఖు నుంచి పనిలోకి రానక్కరలేదని అంటాడూ ? అ ముసిలాడు "నేనేం తప్పు చేశాను మొర్రో" అంటూ తల బాదు కుంటే వాడికి సమాధానం ఏం చెప్పక పోవడం సరికదా 'అసలు గుర్రాన్నీ బండినే అమ్మేస్తున్నాం' అంటూ కుంటిసాకు ఒకటూ ?

"అమ్మగారూ పెద్దబ్బాయిగారు ఇలా అంటున్నారు. నా కేవిటి దారి?" అంటూ స్తంభానికి తల కొట్టుకొని వాడు ఒకటే ఏడుపు—తనకి వాణ్ణి చూస్తే జాలేసింది. పాపం ముసిలాడు ఏదో పొరబాటు చేస్తే నాలుగు చివాట్లేసి గదమాయించాలి గాని ఏకంగా పనిలోంచే మానిపించేస్తాననీ, గుర్రపు శార్బునే అమ్మేస్తాననీ బెదిరిం చడమా ?

అదీ ఉత్తి బెదిరించడం ఏం కాదనీ, నిజంగా అమ్మేస్తే అమ్మెయ్యవచ్చుననీ, ఎవరి తోనో శేఖర్‌బాబు గుర్రపు శార్బు వెల గురించి మాట్లాడుతుండగా ఆ క్రితం రోజున తాను విన్నాననీ పనిమనిషి ఆదెమ్మ సాక్ష్యం చెప్పడంతో వైదేహికి నిజంగానే మతి పోయింది. వెంటనే శేఖర్‌మీద పట్ట లేనంత కోపం వచ్చింది. కానయితే ఆ కోపాన్ని, చెప్పిన ఆదెమ్మ మీదికి మళ్లిస్తూ "విన్నావ రడిగారు? అనవసరం విషయాల్లో జోక్యం చేసుకోకు. పో. పోయి నీ పని చూసుకో" అంటూ కయ్‌మంది.

అయితే—ఆదెమ్మని అంత చప్పుని పంపె గలిగింది కాని, ఆ ఆదెమ్మ చెప్పిన సంగతిని మాత్రం తన హృదయంలోంచి అంత చప్పుని పంపెయ్యలేకపోయింది.

ఈ ఇంటి హోదాకీ, ఈ ఇంట్లోవాళ్ల అంతస్తుకీ ఆధిక్యానికీ ముప్ఫై నలభై ఏళ్లనుంచి చిహ్నంగా ఉంటూఉన్న గుర్రపు శార్బుని తనివేళ అమ్మేస్తాడా ? రోజూ ఆయన కోర్టుకి వెళ్లడానికీ, ఎప్పుడేనా తను దేవాలయానికి సినిమాకి వెళ్లడానికి అది ఎంత ఎలా ఉపయోగపడిందీ పూర్వం ? ఇప్పుడు మాత్రం! రేఖ కాని, చిన్నాడు కాని వచ్చారంటే గుర్రపు శార్బుమీద తప్పిస్తే మరోలాగ బైటికి ఎక్కడికేనా వెళ్తారా ? ఇలా కుటుంబానికి ఎంతో ఉపయోగంగా ఉన్నదాన్ని అమ్మెయ్యాలని ఎల్లా తోచిందో! అయినా గుర్రాల్నీ, బళ్లనీ అమ్ముకోవడం ఏమిటి ? ఏ స్థితికి వచ్చినవాళ్లు చెయ్యాలి అలాంటి పనులు ?

"సరేలే—నేను కనుక్కుంటాను. నువ్వు వెళ్లు" అంటూ బండి వీరయ్యని పంపిం చేసి, తను ఈ సంగతే ఆలోచించసాగింది.

హు! ఇవాళ ఇంట్లో ఉన్న బండిని గుర్రాన్నీ బేరం పెట్టాడు. రేపు ఇంటినే బేరం పెడతాడు. ఇలా మారిపోయాడేవిటి వీడు ? పూర్వం ఎలా ఉండేవాడు ! ప్రతీదీ తన సలహా లేకుండా, తనతో సంప్రదించకుండా చేసేవాడా ? మొన్న మొన్నటిదాకా "ఈ పేంటుమీద ఏ షర్టు వేసుకోమంటావు అమ్మా?" అంటూ తన వెనక వెనకే తిరిగేవాడు కాదూ ! ఆయన పోగానే వీడికీ ప్రాజ్ఞతా, స్వతంత్రశక్తీ, తనకి ఎలా తోస్తే అలా చెయ్యడం, ఎలా వచ్చాయో ఇవన్నీ—పెత్తనం చేతికొచ్చిన దగ్గర్నుంచీ ఈ స్వతంత్రం మరీ పెచ్చు పెరిగిపోయి, 'గుర్రపు శార్బులు అమ్మే స్తాను, శ్రావణి మానేస్తాను' దాకా వచ్చింది. ఇవి రెండే కాదు, ఈ మధ్య కాలంలో ఎన్నో సందర్భాల్లో ఇలాగే ఉంది వాడి ప్రవ ర్తన.

ఓమాటు— అందర్నీ చూద్దాం అని వచ్చి తిరిగి అత్తారింటికి వెళుతూన్న రేఖకి కళ్ల నీళ్లు తెప్పించాడు తన ప్రవ ర్తనతో—వాడు పెట్టిన నూలుచీర చూసి అది ఇంత మొహం చేసుకొని తన దగ్గిరికి వచ్చి "నాన్నగారు లేని లోటు ఎలా కనిపిస్తోందో చూడమ్మా. ఆయన ఎప్పుడేనా నా కిలాంటి నూలు గుడ్డలు కొన్నారా ?—అయినా డబ్బు యిబ్బందిలో తనుంటే నా కిప్పుడీ చీర పెట్టడం ఎందుకు. మా అత్తారి దగ్గర నన్ను అవ మానించడం కాకపోతే! ఇంతకీ పెట్టెలో బోలెడు పట్టుచీరలు మూలుగుతున్నాయి. నా కిప్పుడీ చీర వద్దు" అంటూ ఏక ఇది అయింది.

తనకి మనస్సు చివుక్కుమంది. ఆడ పిల్లకి పెట్టే చీరలోనా మొహం చూసు కోడం ? ప్చ్— ఏవిటో ! రోజురోజుకీ శేఖరానికి జ్ఞానం నశిస్తోంది. ఆయన పోయినప్పటినుంచీ మారిపోయిన తన ఈ రూపంతో వాడి ఎదుట పడలేక జంకి, ఈ మూల గదిలో పడిఉండి వాడికి కని పించలేక తప్పించుకొని కాలక్షేపం చేస్తోంది కనక కాని, లేకపోతే వాణ్ణి పిలిచి ఈ

పొట్టికి నాలుగు చివాట్లూ వేసి ఉండును అలా చేసినందుకు.

"పచ్చగా పుట్టింటి నుంచి వెళు తూన్నదానివి. పెట్టిన చీరని వద్దనకూడ దమ్మా అది నచ్చకపోతే పెట్లో ఉంచే సుకో. వేరే ఇంకోటి తెప్పిస్తాను" అంటూ గుమాస్తాని పంపి బట్టల కొట్లోంచి వో పట్టుచీర అదువు తెప్పించి, పెట్టి ఆ వ్యవహారాన్ని అప్పటికి అలా సర్దు బాటు చేసింది తను.

అంతటితో అయిందా ? వోమాటు చిన్నాడిపట్ల కూడా ఇలాగే ప్రవర్తించాట్ట. వాడు మరీ మరీ చెప్పుకుని బాధపడ్డాడు. ప్రత్యేకంగా వాడిని దిగబెట్టడం కోస మని స్టేషనుకి వెళ్ళినట్లు వెళ్ళి సెకండ్ క్లాస్ టికెట్ ఒకటి కొని యిచ్చాట్ట. క్రూరనాగమ్మ—వాటికి ఎప్పుడూ సెకండు క్లాసులో వెళ్లడం అలవాటు లేదేమో— "అన్నయ్యా ఇది ఫస్టు క్లాసు టికెట్టు కాదు" అంటూ వాడింకా చెప్పబోతుంటే 'అవును' అంటూ గట్టిగా గద్దించి సెకండు క్లాసులోకి ఎక్కించేసి శుభా వంగా పంపించేశాట్ట. "నువ్వు ఇచ్చిన వందా సరిపోలేదు, ఇంకో వంద పంపించ" మని వాడు రాస్తే, సరిపోవడం అంటూ ఎక్కడికి? సరిపెట్టుకోవాలి కాని అంటూ నాలుగు పేజీల చివాట్ల ఉత్తరం ఒకటి రాసి ఏభై రూపాయలు పంపి వూరు కున్నాట్ట.

ఇలా ఒకటా రెండా ? చుట్టాలకి బట్టలు పెట్టడం దగ్గిర్నుంచి ఇంట్లో పనివాళ్ళని తగ్గించడం దాకా ఎన్నిట్లోనో వాడి బుద్ధి కనపరుచుకుంటునాడు.

పోనీ ఇవన్నీ ఇంట్లో సంగ తులు. తను ఏం చేసినా ఎలా చేసినా ఎవ రికీతెలియవు. కాని మరి ఇదేవిటి ?' శ్రావణి మానేస్తే నలుగురూ ముక్కుమీద వేలేసుకోరూ ! పదిమందిలోనూ కుటుంబా నికి ఎంత అప్రతిష్ఠ. అబ్బే—ఇంక వూరు కొని లాభంలేదు. రోజురోజుకీ పట్టు పగ్గాలు లేకుండా పోతోంది. ఇంకా పెచ్చు పెరిగి వ్యవహారం చెయ్యిదాటి పోకముందే పిలిచి నాలుగు చివాట్లూ పెట్టాలి. అలో చిస్తే లాభంలేదు. పిలిపించాలి. వెంటనే పిలిపించాలి.

ఎప్పుడూ లేంది అమ్మ ఎందుకు కబురు చేసిందో, నాలుగు నెలల నుంచీ రాని ముఖ్యమైన విషయం ఇవాళ ఏం వచ్చిందో అర్థంకాక ఆశ్చర్యపోతూ తడబడుతూన్న కాళ్ళతో వచ్చి గది అవతల గడప దగ్గిరే ఆగిపోయాడు శేఖరం. అడుగుల చప్పుడు విని కొడుకు వచ్చాడని గ్రహించి వో రెక్క జారేసి తలుపు వెనక్కి జరిగి కూర్చుంది వైదేహి.

అమ్మతో ఎలా మాట్లాడాలో, ఏమని పలకరించాలో నిర్ణయించుకోలేక, పూర్వం బొట్టూ కాటుకతో కలకల్లాడే అమ్మ ముఖం ఇప్పుడెలా ఉంటుందో వూహించుకో లేక బాధతోనూ బరువుతోనూ సతమత మవుతూ గది ఇవతల శేఖర్—కొండంత బెంగనీ, ఆపుకోలేని దుఃఖాన్నీ అతి ప్రయ త్నంమీద అణుచుకుంటూ, వచ్చిన పెద్ద కొడుక్కి, మారిపోయిన తన ముఖాన్ని చూపించలేక విచారిస్తూ తలుపు వెనకాల వైదేహి. కొడుకు వచ్చి అక్కడ నిల బడ్డాడని వైదేహికీ, అమ్మ తలుపు వెన కాలే కూర్చుందని శేఖర్‌కీ తెలుసు.

కాని ఎవరు పలకరించడం ? ఎలాగ ప్రారంభించడం ?

చివరకి వైదేహే చొరవచేసి, బాధతో వణుకుతూన్న కంఠాన్ని అదుపులో పెట్టు పెట్టుకుంటూ 'బాబూ!' అంది. ఇన్నాళ్ళకి మళ్ళీ మొదటిసారిగా అమ్మ కంఠం విన పడడంతో, శేఖర్‌కి కళ్ళు నీళ్లతో నిండి కంఠం గద్గదికం అయింది. బొంగురు పోయిన గొంతు సవరించుకొని "వూఁ!" అన్నాడు జవాబుగా.

తిరిగి నిశ్శబ్దం.

పిలిపించడం అయితే పిలిపించింది కాని తను చెప్పదలచుకొన్న సంగతిని ఎలాగ ప్రారంభించడం ? ఏ రకంగా చెప్పడం ? ఏమీ నిర్ణయించుకోలేక వైదేహి ఏక తటపటాయిస్తోంది.

చివరకి శేఖరమే సంభాషణ ప్రారం భించాడు "ఎందుకమ్మా రమ్మన్నావుట !" అంటూ. దాంతో వైదేహికి కొంచెం వెసులు బాటు అయింది. "అవును నాయనా. నీతో వో ముఖ్యమైన విషయం మాట్లాడాలి" అంది.

అమ్మ తనతో అంత ప్రత్యేకంగా మాట్లాడవలసిన ముఖ్య విషయం ఏవిటి చెప్మా ! శేఖర్ ఆశ్చర్యపోయాడు.

"చెప్పమ్మా—ఏవిటది ?"

కంఠంలో ఉన్న ఉద్రేకం ఏ కనిపించ నియ్యకుండా, యధాలాపంగా అన్నట్లు అంది "మనది నోటికీ చేతికీ వెలితిలేని సంసారమే కదూ !" అని.

ఎన్నడూ వూహించనిది అమ్మ నోటి వెంట అలాంటి ప్రశ్న రావడంతో వెంటనే గతుక్కుమని మళ్ళీ వెంటనే సద్దు కుంటూ "అదేవిటమ్మా—అలా అడుగు తున్నావేం?" అన్నాడు శేఖర్.

"అహ ! 'మూడంతస్తుల ఈ మేడా పల్లెటూళ్లో ఉన్న ఆ పొలాలూ, మీకేం వండీ జమీందార్లు' అంటూ అందరూ అంటున్న విధంగా మనది నిజంగా సంపన్న కుటుంబమే కదా ! అని."

శేఖర్ ఆ మాటలు విని అదిరిపడ్డాడు. మొదట్లో తెల్లబోయి ఆ తర్వాత అంత కంటే ఎక్కువగా కంగారు పడ్డాడు. ఇలా అడుగుతోం దేవిటి ? సంసారం తాలూకు యదార్థమైన పరిస్థితులు అన్నీ అమ్మకి తెలిసిపోలేదు కదా ! లక్ష రూపాయలకి మేడ తాకట్టులో ఉందని పల్లెటూళ్లో ఉన్న పొలాలకీ వాటిమీద ఉన్న అప్పుకి సరిపోతుందనీ, బేంక్‌లో తమ పేర ఏడెని మిది వేల కంటే ఎక్కువ బేలన్స్ లేదనీ, పరిస్థితుల్ని రెండో కంటి వాడు పసికట్ట కుండా అతి గుంభనగా సంసారాన్ని నడు పుతూ, ఇన్నాళ్లూ నాన్నగారు డాబు గానూ దర్జాగానూ రోజుల్ని గెంటుకుంటూ వస్తు న్నారు కనక 'వారి బాకీ ఎక్కడికి పోతుం' దని వూరుకున్నారు కాని లేకపోతే ఈపాటికి అప్పులవాళ్లందరూ ఇంటిమీదకి దాడి

చేసి ఉండేవారని—ఇవన్నీ అమ్మకి తెలిసి పోయాయా ?

శేఖర్ కి ముచ్చెమటలూ పోశాయి.

నాన్నగారు పోయిన వారం పది రోజులకి ఇనప్పెట్టెలో ఉన్న కాగితాలూ దస్తావేజులూ, డైరీలూ చూస్తుండగా మొదటిసారిగా సంసారం యొక్క ఆర్థిక పరిస్థితులు అర్థమయి తనకిలాగే ముచ్చెమటలూ పోశాయి. షాక్ తిన్నట్లయి, మెదడు పనిచెయ్యడం మానేసి కొంచెం సేపు కొయ్యబారి అలాగే ఉండిపోయాడు.

ఇప్పుడు అమ్మ కూడా అంత బాధ పడిందా ?

నిజమా! నిజంగా కుటుంబానికి ఇంత అప్పు ఉందా? అయితే అందరూ అనుకున్నట్లు మేం ధనవంతులం కాదూ ? ఇన్నాళ్ళూ ఆయన గంభీరంగా నడుపుకుంటూ వచ్చిన జమీందారీ జీవితమంతా అబద్ధమే ! ఇందులో నిజంలేదూ ?— ఏ కాస్తా లేదూ ?—

ఇలా ఏం బాధ పడుతోందో ఏమో ! తలానికి గుండెల్లో జివ్వుమన్నట్లయి నర నరాల్లోనూ ఏదో చెప్పలేని నీరసం ప్రవేశించింది.

ఆరోజున తనూ, ఇవాళ అమ్మా ఇంతగా కలవరపడి కంగారు పడడానికి కారణం ఇన్నాళ్ళూ సంసార పరిస్థితులు ఇలా ఉన్నయనే సంగతి సూచాయగా కూడా తెలియకపోవడమే ! తెలియలేదంటే, నాన్నగారు తెలియనివ్వలేదన్నమాట ! ప్రాజ్ఞుడైన తనకి కాని, పెద్దదైన అమ్మకి కాని 'మన పరిస్థితి ఇది' అని ఆయన ఒక్క రోజు కయినా చెప్పిఉంటే ఇలా ఒక్క మాటుగా కంగారుపడ నక్కర్లేకపోను. అసలు ఎందుకు చెప్పలేదో !

'ఇంట్లో ఉన్న జనం అంతా ఇష్టం వచ్చినట్లు డబ్బు ఖర్చు పెడుతూంటే ఇన్నాళ్ళనించీ ఎందుకు చెప్పకుండా వూరుకున్నారు ?''—ఈ ప్రశ్న మొదటిసారిగా తను జీవితంయొక్క భయంకర రూపం ఎదురుగుండా సాక్షాత్కరించి ఈ బరువు బాధ్యతల నుండి దూరంగా ఎక్కడికైనా

# శ్రావణి

పారిపోదామా అనిపించిన ఆ క్షణంలో వేసుకున్నాడు. ఆ తర్వాత అదే ప్రశ్నని కొన్ని వందల సార్లు వేసుకున్నాడు, తిరిగి తిరిగి—కాని సంతృప్తికరమైన జవాబు రాలేదు. చివరికి తనే ఒక రకంగా సమాధానం చెప్పుకొని తృప్తిపడ్డాడు.

''ఈ ఆర్థిక దుస్థితినంతా వాళ్ళకి చెప్పి వాళ్ళ మనస్సుల్ని కూడా ఎందుకు కలతపెట్టడం ?—జమీందారీ కుటుంబం తమది అంటూ హాయిగా బతుకుతున్న వాళ్ళతో ఈ సంగతి చెప్పి వాళ్ళ ఆనందానికి గొడ్డలిపెట్టు వేయడం ఏమంత విజ్ఞత? వాళ్ళనేనా ఆనందంగా ఉండనీ— ఈ బాధలేవో మనమే సర్దుకుంటూ మూసిన గుప్పిటిలాగ ఈ రథాన్ని లాగుదాం. అది కూడా సాధ్యం కానప్పుడు అప్పుడే చెప్పొచ్చు.''

నాన్నగారు బహుశా ఈ రకంగాఆలోచించి ఉంటారు. అందుకే ఎవ్వరికీ— చివరకి తనకు కూడా పరిస్థితులు తెలియనివ్వలేదు. ఆయన అలా చేశారు. సరే— ఇప్పుడు నే నెలా చెయ్యాలి? అమ్మకీ వాళ్ళకీ అసలు విషయం చెప్పడమా, లేక నిప్పులాంటి ఈ నిజాన్ని తనలో ఇముడ్చుకొని వూరుకోవడమా ? చెబితే తను పడినంత క్షోభా వాళ్ళూ పడతారు. చెప్పకపోతే ఈఖర్చులు ఇలాగే సాగిస్తారు. ఏవిటి చెయ్యడం ? ఎలాగ దీన్ని పరిష్కరించడమా ? చాలారోజులపాటు ఇలా మధన పడి మధనపడి చివరికి నాన్నగారిలాగ పొగ అంతా తనలోనే ఇముడ్చుకొని కాంతీ, వెలుతురూ మాత్రమే అమ్మకీ వాళ్ళకీ పంచాలి అని నిశ్చయించుకున్నాడు.

అలా వో నిశ్చయానికి వచ్చి, దాని ప్రకారం యదార్థ పరిస్థితులు ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడుతూ, నెమ్మది నెమ్మదిగా అనవసరపు ఖర్చుల్ని మాత్రం తగ్గించుకుంటూ వస్తూంటే, అన్ని విషయాలూ అమ్మ కివాళ తెలిసిపోయాయంటే పాడలిపోదు మరీ !

ఏవిటో—తన భయం కాని అమ్మ కెలా తెలుస్తుంది ? తనకి తప్ప ఎవరికీ తెలియదు, తను ఎవరికీ చెప్పలేదు. ఇంకెలా తెలుస్తుంది. అంతే. అతను వూరికే అనవసరంగా భయపడుతున్నాడు. ఇలా అనుకుని, ఎందుకేనా మంచిదని లేని గాంభీర్యాన్ని మొహంలోకి తెచ్చుకుంటూ ''అయినా నీకీ అనుమానం ఎందుకు వచ్చిందమ్మా !'' అన్నాడు కొంచెం చిరునవ్వు, కూడా ఆ మాటకి అతికించి.

వైదేహి కొంచెంసేపు వూరుకొని ''దేనికీ లోటులేని కుటుంబం మనది. అవును కదా ? అటువంటప్పుడు లేని వాళ్ళలాగ ప్రవర్తించడం దేనికి మనం ?''

ఆ మాటలతో శేఖర్ కి పెద్ద బరువు దింపినట్లయింది. 'హమ్మయ్య' అని దీర్ఘంగా శ్వాస వదిలి నేను భయపడినట్లు అమ్మకేం తెలిసిపోలేదు. అంటే ఇంకా పాత దృష్టిలోనే ఉందన్నమాట! అయితే ఫరవాలేదు.

కాని ఇలా మాట్లాడుతోంది ఏమిటి? నేను చేసిన పని ఏదైనా నచ్చలేదా ? తనకి కష్టం కలిగించే పని ఏదైనా చేశానా — అంటూ శేఖరం తనలో తాను వితర్కించుకుంటూ ఉండగా వైదేహి తలుపు వెనక్కి ఇంకొంచెం వెనక్కి జరిగి ''అవును గానీ—నువ్వు గుర్రపు షార్టు అమ్మేస్తానన్నావా ?'' అంది.

శేఖర్, అమ్మకెలా తెలిసిందా అని మొదట తెల్లబోయి, వెంటనే వీరయ్య చెప్పి ఉంటాడని గ్రహించి ''అ..వు..ను'' అన్నాడు నెమ్మదిగా. ''ఏం!'' అంది వైదేహి.

ఏమని చెప్తాడు శేఖర్! ''ఏ వారానికో పదిరోజులకోగాని ఆ గుర్రపుషార్టుని ఉపయోగించడంలేదు ఇంట్లో ఎవరూ. ఇందుకోసం అని గుర్రం మేతకిందా వీరయ్యా జీతం కిందా నెలనెలా నూరు నూటపాతిక రూపాయలు పెట్టుబడి పెట్టడం కంటే ఏనాలుగైదు రూపాయలో ఖర్చు పెట్టి రిక్షా మీద పోలేదూ'' ఈ మాటనే అమ్మ దగ్గిర అంటే, ''ఊఁ, ఖర్చయితే!'' అంటుంది. దానికి తను సమాధానం ఏం చెప్తాడు! కుటుంబ పరిస్థితులు ఇవిగో

ఇలా ఇలా ఉన్నాయి అని చెప్పాలి. అంతే కదా!.. అలా చెప్పదేం అంటూ వస్తే తను ఇన్నాళ్ళూ గుట్టుగా ఎందుకు ఉంచినట్లు? అందుకే ఆమె అడిగిన దానికి సమాధాన మేమీ చెప్పకుండా మౌనంగా ఊరుకున్నాడు.

"అదిసరే దానికేంగాని. ఇటు చూడు. 'చిన్నాడూ రేఖా నీకంటే చిన్నవాళ్ళు. వాళ్ళ మనస్సులలో నాన్నగారు లేకపోయారే అనే బెంగా, ఆయన ఉంటే ఇలా జరిగేదా అన్న అసంతృప్తి తలఎత్తకుండా చూసే బాధ్యత నీ మీద ఉంది. ఆ బాధ్యతని నువ్వు గుర్తించకపోతే.."అంటూ మాట మధ్యలోనే ఆగిపోయింది వైదేహి.

అమ్మ మాటలు విని పిడుగు పడ్డట్లు ఉలిక్కిపడ్డాడు శేఖర్. ఆమె అనేదేవిటి! తమ్ముణ్ణీ చెల్లెల్నీ తను సరిగ్గా చూడ్డం లేదనే కదూ ఆ మాటలో అర్థం? ఆ అపనింద పై వాళ్ళెవరేనా వేస్తే ఆదుకోవలసింది తనే ఆ మాట అంటుందా? అమ్మ నోటి వెంటే ఆమాట వస్తే తనింక ఎవరితో చెప్పుకుంటాడు? బాధవల్ల కళ్ళలో నీళ్ళు తిరిగాయి. డగ్గుత్తికతో "అదేవిటమ్మా! తమ్ముడినీ, చెల్లాయినీ నేను సరిగ్గా చూడ్డంలేదూ?" అన్నాడు.

"నన్ను అడుగుతావేం? నీ మనస్సుకి నీకు తెలియదూ?" కంఠంలో కొంచెం నిష్ఠూరాన్నీ, మరికొంచెం వెటకారాన్నీ రంగరించి అంది.

శేఖర్‌కి ఈ లోకం అంతా ఒక్కమారు చీకటయినట్లు అనిపించింది. తల, ఒళ్ళూ, ఆ ప్రదేశమూ అంతా ఒక్కమారు గిర్రున తిరిగినట్లయి, చీకట్లు కమ్ముతున్న కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. కన్నతల్లే కొడుకు నిజాయితీని శంకిస్తే ఇంక ఆర్చేదెవరు? మౌనంగా ఏడ్చాడు శేఖర్.

కొడుకు ఏమీ మాట్లాడకపోవడం చూసి "ప్రతీదీ నేను ఇలా ఆరాతియ్యడం నీ మనస్సుకి కష్టంగా ఉంది కదూ "అంది.

"అమ్మా!" అన్నాడు బాధగా శేఖర్.


కొడుకు గొంతుకలోని వేదనని గమనించి వైదేహి గతుక్కుమంది. కొంచెం సేపటికి సర్దుకుని "సరే వీటన్నిటి సంగతి ఏంలే! ఇవి ఇంట్లో విషయాలు ఎలా సర్దుకుపోయినా పోతాయి. కాని శ్రావణి జరిపించడం మాత్రం మానేస్తే...." అంటూ మాట మధ్యలో ఆగిపోయింది.


ఎంతో ప్రయత్నం మీద గొంతుక సవరించుకుంటూ "అన్నీ ఆలోచించిన మీదటే మానెయ్యాలని నిశ్చయానికి వచ్చానమ్మా" అన్నాడు.

కొడుకు సమాధానం విని వైదేహి కోపంతో వణికిపోయింది "ఆలోచించావా? ఏవిటి నువ్వు ఆలోచించింది? పోయిన మీ నాన్నగారి గౌరవాన్నా? ఇంట్లో జరుగుతూన్న ఈ మార్పులన్నీ చూస్తూ ఇంకా చావలేక బతికున్న మీ అమ్మ ఆవేదననా? నీ కొత్తపద్ధతుల వల్ల కుటుంబానికి లభించబోతూన్న అప్రతిష్టనా? దేనిని నువ్వు ఆలోచించింది?" అంటూ గబగబా అనేసి ఆతర్వాత వెక్కివెక్కి ఏడుస్తూ కూర్చుంది. శేఖర్ 'అమ్మా!' అని ఒక్క అరుపు అరిచి ఒక్క అంగలో గడప దాటి లోపలికి వెళ్ళాడు.

మోకాళ్ళ మీద తలపెట్టుకొని ఏడుస్తోంది. అమ్మ మనస్సు ఎంత బాధపెట్టాడు తను? పోనీ అమ్మకి పరిస్థితి అంతా చెప్పేస్తే? తమకి ఉన్న ఆస్తి ఎంతో, అప్పు ఎంతో, ఎందువల్ల ఏడెనిమిది వందలు ఖర్చు అయ్యే శ్రావణిని తాను మానిపించ దలుచుకున్నాడో, ఖర్చులు కొనక తగ్గించకుండా ఇలా యథాప్రకారం సాగిస్తే ముందు ముందు ఏయే ప్రమాదాలు వస్తాయో, ఇవన్నీ వివరంగా అమ్మకి చెప్పేస్తే?

కాని అందువల్ల, తాను ప్రస్తుతం, అమ్మకి ఏ బాధ అయితే తగ్గిద్దామని అనుకుంటున్నాడో అదే పదింతలై ఆమె హృద





సోల్ డిస్ట్రిబ్యూటర్లు : జె. ఎల్. మారిసన్, సన్ అండ్ జోన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, పోస్టు బాక్స్ నం. 1746, బొంబాయి-1.

LPE Ayyars. J 9 Tb

## శ్రావణి

యాన్ని కోసెయ్యదూ? ఏమీ చెప్పకుండా పూరుకుంటే ఇప్పుడింకోలాగ అర్థం చేసు కొని బాధపడుతోంది కదా? మరి ఎలాగ ఏవిటి చెయ్యడం?

ఏమైనా అమ్మ దుఃఖాన్ని తను చూడ లేడు.

చివరికి ఎలాగైతేనేం దగ్గిరగా వెళ్ళి 'అమ్మా'! అని పిలిచాడు బాధగా.

వైదేహి తల ఎత్తకుండానే "వెళ్ళు నాకేం చెప్పక్కర్లేదు. నువ్వు ప్రాజ్ఞుడివి అయ్యావు. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో!" అంది.

"అది కాదమ్మా. నేను చెప్పేది కొంచెం విను" అన్నాడు కంఠంలోని డగ్గుత్తికని కనిపించకుండా ప్రయత్నిస్తూ.

"ఏం విననక్కరలేదు. పోయిన ఆయన అన్నా, బతికున్న నేనన్నా పీసమెత్తయినా గౌరవం లేనివాడివి నీ మాట ఎందుకు వినడం?"

"గౌరవం లేకపోవడం ఏవిటమ్మా?"

"ఆ ! ఏం ఉందో. ఈ శ్రావణి మానె య్యడంలోనే కనిపిస్తోందిగా?"

ఒక్కనిముషం మౌనపడి అలాగే ఉండి పోయి, ఆ తర్వాత ఓ నిశ్చయానికి వస్తూ "సరేనమ్మా. నువ్వే అలా అనుకొనే మాట యితే సరే. శ్రావణి జరిపిస్తాలే. తప్పకుండా జరిపిస్తా" అన్నాడు.

కొడుకు కంఠంలో వినిపించిన దుఃఖా వేశానికి తత్తరపడి చటుక్కున తల ఎత్తి చూసింది వైదేహి. అప్పటికే వెనక్కి తిరిగిన శేఖర్ గడప దాటబోతున్నాడు. "అయ్యో! వాడి మనసు ఎంత కష్ట పెట్టానో" అనినొచ్చుకుంటూ "పెద్దాడా!" అని పిలిచింది రుద్ధకంఠంతో.

అమ్మ పిలుపుకి కన్నీళ్ళ సమాధానంగా చొక్కా చేతుల్తో కళ్ళు తుడుచుకుంటూ వెనక్కి తిరిగి చూడకుండా కదిలి వెళ్ళి పోయాడు శేఖర్ "సరే.. శ్రావణి జరిపిద్దాం ప్రస్తుతానికి. ఆతర్వాత విషయం తర్వాత చూసుకోవచ్చు" అని మనస్సులో అనుకుంటూ—●